
# * కి్రే.... జ్ *

ఆ ఆఫీసు గేటు దగ్గరున్న వాచ్‌మ్యాన్ దూరంగా చూశాడు. వాడి కళ్లు భయంతో పెద్దవయ్యాయ్. ఒక్కసారిగా గుండెలు బాదుకుని రివ్వున ఆఫీసు కాంపౌండ్‌లోకి పరుగు తీశాడు.




వరండాలో స్టూలు మీద కూర్చుని కునికిపాట్లు పడ్తున్న ప్యూను యాదగిరితో అరుస్తూ చెప్పాడు వాచ్‌మ్యాన్.

"వస్తున్నాడు... వస్తున్నాడు... జాగ్రత్త!"

ఆ మాట వినగానే యాదగిరి ఉలిక్కిపడి స్టూలు మీద నిటారుగా కూర్చోబోయి ఒక్కసారి ఆ ప్రయత్నం చేయడంవల్ల కుదుపుకి బ్యాలెన్స్ తప్పి స్టూలుతో సహా కింద పడిపోయాడు.

"జాగ్రత్త... నేనొస్తా... " అని యాదగిరితో చెప్పి మెయిన్ గేటు దగ్గరకి పరుగున వెళ్ళి ఎటెన్షన్‌లో నిలబడ్డాడు వాచ్‌మ్యాన్.

యాదగిరి గబగబా స్టూలుని నిలబెట్టి దాని మీద నిటారుగా కూర్చున్నాడు. అంతలోనే గుర్తుకొచ్చి నాలుక కొరుక్కున్నాడు.

"అర్రే ఇస్కీ!... లోపటున్నోల్లకు భీ చెప్పాలె గదా?" అనుకుని ఆఫీసులోకి పరుగు తీశాడు.

హాల్లోని అందరూ యాదగిరి తుఫానులా లోపలికి రావడం చూశారు.

"వచ్చేసిందు.. వచ్చేసిందు..." అని చెప్పి ఫ్యూన్ యాదగిరి మళ్ళీ బయటికి పరుగున వెళ్ళి స్టూలు మీద కూర్చున్నాడు. అలా పరుగున వచ్చి కూర్చోవడం వల్ల స్టూలు కాళ్ళు పైకిలేచి మళ్ళీ కింద పడ్డాడు. "అర్రే ఇస్కీ.." అని కింది నుండి లేచి స్టూలుని నిలబెట్టి దాని మీద నిటారుగా కూర్చున్నాడు.

యాదగిరి చెప్పిన విషయానికి హాల్లో కలకలం బయలుదేరింది.

ఒక్కొక్క టేబులు దగ్గర నిలబడి గుంపులు గుంపులుగా మాట్లాడుతున్న అందరూ చెల్లాచెదురై పోయారు. కంగారు కంగారుగా అందరూ ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చున్నారు.

వీళ్లందరూ ఇంతగా భయపడ్డానికి కారణం వాళ్ల బాస్ వీరభద్రం. ఆఫీసుకి వీరభద్రం ఇన్‌ఛార్జ్‌గా రీసెంట్‌గా వచ్చాడు. అతను చండశాసనుడు. స్టాఫ్‌ని కాల్చుకుని తినేస్తాడు. అందుకే అతనంటే అందరికీ ఒణుకే.

వీరభద్రం హాల్లోకి అడుగుపెట్టి ఓసారి అందర్నీ పరిశీలనగా చూశాడు. అందరూ హడావిడిగా ఫైళ్ళలో తలలు దూర్చేసి సీరియస్‌గా స్టడీ చేస్తున్నారు.

వీరభద్రం తను నిల్చున్న స్థలానికి దగ్గరగా ఉన్న టేబులు దగ్గరికి మెల్లగా నడుచుకుంటూ వెళ్ళాడు. ఆ సీట్లోని జూనియర్ అసిస్టెంట్ తలని మరింతగా ఫైల్లోకి దూర్చేసి జాగ్రత్తగా పరిశీలించసాగాడు.

వీరభద్రం అతని నెత్తిన ఒక్క జల్లకాయ్ కొట్టాడు.

"గుడ్ మాణింగ్ సర్!.." అన్నాడు కంగారుగా లేచి నిలబడ్తూ అప్పుడే బాస్‌ని చూస్తున్నట్టుగా ఆ జూనియర్ అసిస్టెంటు.

హాల్లోని మిగతా అందరూ కూడా కంగారుగా లేచి నిలబడి గుడ్ మాణింగ్ సార్ అన్నారు.

"గుడ్ మాణింగ్!..." అందరికీ చెప్పాడు వీరభద్రం. తరువాత జూనియర్ అసిస్టెంటు వంక సీరియస్‌గా చూస్తూ "నీకు జల్లకాయ్ ఎందుకు కొట్టానో తెల్సా?" అని అడిగాడు.

"ఈ ఫైలుని నేనింకా పూర్తి చేయలేదని!" నసుగుతూ అన్నాడు అతను.

"కాదు... నువ్వు ఫైలు తలకిందులుగా పెట్టి చూస్తున్నావ్!" గుర్రుగుర్రుగా చూస్తూ అన్నాడు వీరభద్రం.

జూనియర్ అసిస్టెంటు కంగారుపడిపోయాడు.

"ఈ కేసంతా తలకిందుల వ్యవహారంలా ఉంది సార్... అందుకనే...

హిహి..." అన్నాడు లేని నవ్వు తెచ్చిపెట్టుకుని.
"ఊ... ఊ... జాగ్రత్తగా ఒళ్ళు దగ్గరగా పెట్టుకుని పని చెయ్యి..."
నెత్తిన మరో జల్లకాయ్ కొట్టి తన కాబిన్‌లోకి వెళ్ళిపోయాడు వీరభద్రం.
అప్పుడు సమయం తొమ్మిదీ యాభై అయింది. ఆఫీసు పది గంటలకి. అయినా సరే ఒక పావుగంట ముందే స్టాఫ్ మొత్తం సీట్లలో ఉండాలి. లేకపోతే వీరభద్రం ఊర్కోడు.
ఆ రోజు క్రికెట్ మ్యాచ్ ఉంది... ఇండియాకీ టుమ్రీ దేశానికీ మధ్య వన్‌డే ఇంటర్నేషనల్.
మ్యాచ్ పది గంటలకి స్టార్ట్ అవుతుంది. అందరికీ కామెంట్రీ వినాలని ఉంది. కానీ వీరభద్రంకి తెలిస్తే ఇంకేమైనా ఉందా?... ప్రాణాలు తోడేస్తాడు. ఏ దూర ప్రాంతాలకో ట్రాన్స్‌ఫర్ చేసేస్తాడు.
వీరభద్రంకి ముందున్న బాస్ అయితే తను కూడా క్రికెట్ కామెంట్రీ వినేవాడు... ఆఫీసులో ఎవరు విన్నా కూడా ఏమీ అనేవాడు కాదు.
కాని ఇంత స్ట్రిక్టుగా ఉండే వీరభద్రం ఆఫీసులో క్రికెట్ కామెంట్రీ వింటే ఊర్కుంటాడా?
చచ్చినా ఊర్కోడు.
పది గంటలైంది.
సీనియర్ అసిస్టెంటు అటూ ఇటూ దొంగ చూపులు చూసి మెల్లగా టేబులు సొరుగు లాగాడు. అందులోని ట్రాన్సిస్టరు బయటకి తీసి ఆన్ చేశాడు.
అందరూ ఆశ్చర్యంగా భయం భయంగా సీనియర్ అసిస్టెంటు వంక చూశారు.
"ఏమిటీ?... ట్రాన్సిస్టర్ తీశావ్?.. క్రికెట్ కామెంట్రీ విందామనే. బాస్‌కి తెలిస్తే ఏ మారుమూల అడవుల్లోకో నిన్ను ట్రాన్స్‌ఫర్ చేసేస్తాడు తెల్సా?" అన్నాడు సీనియర్ అసిస్టెంటుని చూస్తూ స్టెనో.
"అంత తెలిసేలా వింటామా ఏంటి?.. బాస్ క్యాబిన్‌లోంచి బయటికి రాగానే ట్రాన్సిస్టర్ దాచేస్తాం.." అన్నాడు సీనియర్ అసిస్టెంట్.
"అలాగైతే నా దగ్గర కూడా ట్రాన్సిస్టరు ఉందోచ్.." అన్నాడు టైపిస్టు తన ట్రాన్సిస్టరు కూడా బయటికి తీస్తూ.
అంతే.. ఆ హాల్లోని స్టాఫ్ రెండు గ్రూపులుగా విడిపోయారు.
ఒక గ్రూపు సీనియర్ అసిస్టెంటు చుట్టూ ఇంకో గ్రూపు టైపిస్టు చుట్టూ.

కామెంట్రీ మొదలైంది.
టాస్ టుమ్రీ దేశం గెలిచింది. వాళ్లే బ్యాటింగ్ తీస్కున్నారు. ఇండియా ఫీల్డింగ్!
ఆట మొదలైంది. మొట్టమొదటి బంతిని కట్ చేసి సింగిల్ రన్ తీస్కున్నారు టుమ్రీ దేశం ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్.
"హబ్బా!.. మొదటి బాల్లోనే రన్ తీస్కున్నాడు." బాధగా అన్నాడు సీనియర్ అసిస్టెంటు బుర్రకాయ్‌ని పట్టుకుంటూ.
చుట్టూ ఉన్నవారు అంతకంటే బాధగా నిట్టూర్చారు.
రెండో బంతి...
క్లీన్ బౌల్డ్.. టుమ్రీ దేశం మొదటి వికెట్టు పడిపోయింది. వన్ ఫర్ వన్!
"హుర్రా..." ఆనందం పట్టలేక గట్టిగా అరిచాడు స్టెనో.
మిగతావాళ్ళు చప్పట్లు చరిచారు.
హఠాత్తుగా క్యాబిన్ తలుపులు తెరుచుకున్నాయ్.
అంతే. అందరూ చెల్లా చెదురైపోయి ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చున్నారు.
సీనియర్ అసిస్టెంటూ, టైపిస్టూ ఇద్దరూ ట్రాన్సిస్టర్లు డ్రాలలో దాచేశారు.
"ఏంటీ .. క్రికెట్ కామెంట్రీ వింటున్నారా?" అందర్నీ చూస్తూ అడిగాడు వీరభద్రం.
"అబ్బే... లేద్సార్.. ఆఫీస్లో యేంటి కామెంట్రీ వినడం ఏంటి? హి... లేనే లేద్సార్!" అన్నాడు సీనియర్ అసిస్టెంటు లేచి నిలబడి చేతులు నలుపుకుంటూ.
"ఈ వేళ క్రికెట్ మ్యాచ్ ఉందా?" అన్నాడు స్టెనో అమాయకంగా మొహం పెట్టి.
వీరభద్రం వాళ్లందరి వంకా కోపంగా చూస్తూ అన్నాడు:
"నా దగ్గర నాటకాలు వెయ్యకండి... ఈ వేళ టుమ్రీ దేశానికీ మన దేశానికి మధ్య క్రికెట్ మ్యాచ్ ఉందని నాకు తెల్సు... అలా క్రికెట్ మ్యాచ్ ఉన్నప్పుడు ఆఫీసులోనైనా సరే ఎవరూ కామెంట్రీ వినకుండా ఉండలేరనీ నాకు తెల్సు... చెప్పండి.. కామెంట్రీ వింటున్నారా లేదా?"
అందరూ తలలు వొంచుకున్నారు.
"నువ్వు ట్రాన్సిస్టర్ తెచ్చావా?"
సీనియర్ అసిస్టెంటు వంక సూటిగా చూస్తూ అడిగాడు వీరభద్రం.
"తెచ్చాను.." మెల్లగా గొణుగుతూ అన్నాడు సీనియర్ అసిస్టెంటు.

అందరూ సీనియర్ అసిస్టెంటు వంక జాలిగా చూశారు. అతనికి ఏ మారుమూల అడవుల్లోకో ట్రాన్స్‌ఫర్ కావడం ఖాయం!

"నన్నడిగితే నేను తేలేదని అబద్ధం చెప్పాలి" అనుకున్నాడు టైపిస్టు.

"ఏదీ ఇలా తే..." వీరభద్రం చేయి చాపాడు.

సీనియర్ అసిస్టెంటు బిక్కమొహం వేస్కుని డ్రాలోంచి ట్రాన్సిస్టర్ తీసి అతనికి ఇచ్చాడు.

దాన్ని వీరభద్రం కిటికీలోంచి అవతలకి పారేయడం ఖాయం... అనుకున్నాడు సీనియర్ అసిస్టెంటు.

రిలయన్స్ కప్ సిరీస్ గురించి ఈ మధ్యనే ఆ ట్రాన్సిస్టర్ కొన్నాడు అతను.

"ఒక్క రోజు క్రికెట్ కామెంట్రీ విన్నంత మాత్రాన ఆఫీసులోని ఫైళ్లేమీ మురిగిపోవులే.. మీలో ఎవరి దగ్గరైనా ఇంకో ట్రాన్సిస్టర్ ఉంటే వినండి. నేను దీంట్లో వింటాను..."

అలా అనేసి చరచరా క్యాబిన్‌లోకి ట్రాన్సిస్టర్‌తో సహా వెళ్ళిపోయాడు వీరభద్రం.

"హుర్రా!... క్రికెట్ క్రేజ్ ఎంతటిది?!..."

అందరూ నోళ్లు తెరుచుకుని క్యాబిన్ వైపు చూస్తూ ఉండిపోయారు కొన్ని క్షణాలు.

* * *